

# మార్పు

- కె. సాయిలక్ష్మి

**రజనీ, రజనీ... హాల్లోనుంచి గట్టిగా పిలిచింది కమల కోడలిని. వంట చేస్తున్న రజని ఏంటత్తయ్యా! అంటూ వంటింట్లోంచి అత్తగారి దగ్గరకి వచ్చింది.**

మీ నాన్న గారు ఫోన్ చేశారు. ఇప్పుడే... నువ్వు, పిల్లలు ఎలా ఉన్నారని. వాళ్ళకి నిన్ను, పిల్లల్ని చూ డాలని ఉందేమో, వెళ్ళి రాకూడదు అంది కమల. ఆవిడ వెళ్ళమనడంలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకున్న రజని సరే, మీ అబ్బాయిని కూడా అడగాలి కదా! అతను కూడా వెళ్ళమంటే వెళ్తాను అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మర్నాడు ఉదయం రజనీని, పిల్లలిద్దర్నీ బస్సెక్కించాడు శ్రీరామ్. కొద్ది సేపటికి బస్సు బయలుదేరింది. బస్సులో కూర్చున్న రజనీ ఆలోచిస్తున్నది. కూతురు పుట్టింటికి వస్తున్నప్పుడల్లా తనని పుట్టింటికి ఏదో ఒకటి చెప్పి పంపేస్తుంది అత్తగారు. ఎన్నాళ్ళిలా? పిల్లలు చిన్న వాళ్ళు గనక సరిపోయింది. రేపు వాళ్ళని స్కూల్లో జాయిన్ చేస్తే, చీటికి, మాటికి స్కూలు మాన్పించి తనతో ఇలా ఊరికి తీసుకెళ్ళిపోతే అవదు కదా! శ్రీరామ్‌కి తల్లి ఎంత చెప్తే అంతే. ఆవిడ మాట కాదంటే ఎంత గొడవ చేస్తుందో తెలుసు. అందుకే వీలైనంత వరకు తల్లిమాట కాదనడు. కూతురుకి ఆవిడ జరిపే భోగాలను చూసి తనెక్కడ అసూయపడతానో అని కూతురు వచ్చినప్పుడల్లా తనని ఇలా పంపిస్తుంటుంది. అయినా ఆవిడ తన కూతురుకి తన ఇష్టం వచ్చినట్టు చేసుకోని. తనెందుకు బాధపడుతుంది? పెళ్ళయి నాలుగేళ్ళయినా అత్తగారు తనని ఎందుకు అర్థం చేసుకోరు? అన్ని విషయాల్లో తను ఎంతగా సర్దుకుపోతుందో ఆవిడకి మాత్రం తెలీదా! ఆవిడలో మార్పు ఎన్నాళ్ళకో మనసులోనే అనుకుంది రజనీ.

మధ్యాహ్నం ట్రైన్‌లో వచ్చారు అరుణ, శేఖర్. కూతుర్ని చూడగానే ముఖం ఆనందంతో వెలిగిపోయింది కమలకి. రండల్లుడు గారూ, రామ్మా అరుణా! ఏంటీ అలా చిక్కిపోయావు? నీ ఆరోగ్యం బాగుందా? ఆప్యాయంగా ప్రశ్నించింది కూతుర్ని.

నేను బాగానే ఉన్నానమ్మా! నీ కళ్ళకి ఎప్పుడూ చిక్కిపోతున్నట్టే కనిపిస్తాను చిరుకోపంగా అంది అరుణ. అది సరేగానీ, వేడిగా మంచి కాఫీ ఇవ్వమ్మా, తలనొప్పిగా ఉంది. తర్వాత భోంచేస్తాము. రండీ అంటూ భర్తని గదిలోకి తీసుకెళ్ళింది.

కాఫీ తాగుతూ శ్రీరామ్, శేఖర్ కబుర్లలో పడ్డారు. కూతుర్ని వంటింట్లోకి తీసుకెళ్ళి వంటచేస్తూ. కూతురి అత్త వారి విషయాలు అడుగుతూ కూతుర్ని, అత్తవారు ఎలా చూసుకుంటున్నారో ఆరాలు తీస్తున్నది కమల. తను అత్త గారింట్లో ఎంత కష్టపడిపోతున్నది వివరిస్తున్నది తల్లికి తగ్గ ఆ కూతురు.

రెండు రోజులుండి బయలుదేరాడు అరుణ భర్త శేఖర్. అత్తగారు నేను బయలుదేరతాను. మీ అమ్మాయిని వారం రోజులుంచుకుని పంపేయండి. నాకు మళ్ళీ రావడానికి వీలవదు. ట్రైన్ ఎక్కించి నాకు ఫోన్ చేస్తే నేను స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాను లేదా మీరు దిగబెట్టినా సరే, మీ ఇష్టం. వస్తాను. అత్తగారితో, భార్యతో చెప్పి బయలుదేరాడు శేఖర్.

కూతురు వచ్చిందంటే కమలకు క్షణం తీరికుండదు. తన దగ్గరున్నన్ని రోజులు కూతుర్ని కాలుకింద పెట్టనీయకుండా అపురూపంగా చూసుకుంటుంది. అత్త వారింట్లో కూతురు ఎంతో కష్టపడి పోతుందని, వాళ్ళందరికీ చాకిరి చేసి అలసిపోతుందని, ఇక్కడికొచ్చినప్పుడైనా కూతుర్ని సుఖపడేటట్లు చేయాలని ఆవిడ తపన. అరుణ కూడా తల్లికి తగ్గ కూతురే. కావలసినవన్నీ తల్లిచేత చేయించుకుంటుంది. తల్లితో ఏవేవో కబుర్లు చెప్పి వచ్చినప్పుడల్లా 2, 3 చీరలు కొనిపించుకుంటుంది. కూతురికి తను జరిపే ఈ భోగాలన్నీ చూసి కోడలు ఎక్కడ బాధపడిపోతుందోనని కూతురు వస్తుందని ముందుగా తెలిస్తే చాలు కోడల్ని తెలివిగా వాళ్ళ పుట్టింటికి పంపేస్తుంది కమల.

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. అరుణని పంపించెయ్యమని ఆమె భర్త ఫోన్‌చేసి చెప్పడంతో కూతుర్ని తనే స్వయంగా అత్తవారింట్లో దింపి రావడానికి బయలుదేరింది కమల. కూతురికి కొన్న 3 చీరలు, బెడ్‌షీట్స్ కొత్తగా మరో సూట్‌కేస్ కొని అందులో సర్దింది. ఊరగాయలు, పొడులు విడివిడిగా పేక్ చేసి అవి మరో బేగ్‌లో సర్దింది. సామాన్లు అన్నీ తీసుకుని స్టేషన్‌కి బయలుదేరారు తల్లీకూతుళ్ళు. వాళ్ళిద్దర్నీ ట్రైన్ ఎక్కించి వచ్చాడు శ్రీరామ్.

ఇంటి ముందు ఆటో దిగి సామాన్లు దించి డబ్బులిచ్చి ఆటోవాడ్ని పంపించింది అరుణ. సామాన్లు తీసుకుని ఇంట్లోకి అడుగు పెట్టబోతున్న కూతురి చెయ్యి పట్టుకు ఆపి మాట్లాడవద్దన్నట్టు సైగ చేసింది. లోపల్నుంచి అరుణ అత్తగారు, అరుణ ఆడపడుచు మాటలు వినిపిస్తున్నాయి. అరుణ ఆడపడుచు అంటున్నది. అమ్మా నేను రేపే వెళ్ళిపోతాను. ఈలోగా ఒదిన వచ్చేస్తే బాగుండును. చాలా రోజులైంది ఒదినని చూసి. అవునూ నేను ఇక్కడికి వచ్చినప్పుడల్లా వదిన ఎందుకు వాళ్ళ పుట్టింటికి వెళ్ళిపోతుంది? అడిగింది.

అరుణ అత్తగారు అంటున్నది. అది వెళ్ళడం కాదు. నేనే పంపిస్తున్నాను. నువ్వు వచ్చినప్పుడు అది ఇక్కడ ఉంటే నీ సరదాలు మేము తీరుస్తుంటే అది బాధపడిపోదు? దాని సొమ్మేదో నీకు పెట్టేస్తున్నామని. అందుకే దాన్ని వాళ్ళ పుట్టింటికి పంపించేస్తాను అంటున్నది. తప్పు కదమ్మా వదిన ఎందుకు బాధపడుతుంది? తను అలాంటిది కాదు. ఒకవేళ నిజంగా బాధపడుతుందనుకుంటే నా కోసం మీరేమీ ఖర్చుపెట్టకండి. ఈసారి నేను వచ్చినప్పుడు అలా పంపించేస్తే నేను ఇక్కడికి రానేరాను. అయినా నేను ఎప్పుడో వచ్చి నాలుగైదు రోజులుండి పోతాను. జీవితాంతం నువ్వు, నాన్న గారు తన దగ్గరే ఉండాలి కదా! కూతుర్ని, కోడల్ని సమానంగా చూడాలి కానీ, ఈ వ్యత్యాసం ఎందుకమ్మా! తల్లిని మందలించింది అరుణ






గ్రాఫిక్స్: భాస్కర్

ఆడపడుచు.

సర్లే, నువ్వు నాకు చెప్పొచ్చేవు కానీ, అరుణ వాళ్ళమ్మ చేస్తున్న పనేమిటి? అరుణ వెళ్ళినప్పుడల్లా ఆవిడ కోడల్ని వాళ్ళ పుట్టింటికి పంపించట్లా. అయినా నీకొక నిజం చెప్పనా! నాకు నువ్వెంతో, అరుణ కూడా అంతే. కాకపోతే అరుణ వెళ్ళినప్పుడల్లా ఆవిడ కోడల్ని వాళ్ళ పుట్టింటికి పంపేస్తుంది. నువ్వు వచ్చినప్పుడల్లా నేను అరుణని వాళ్ళింటికి పంపిస్తున్నప్పుడైనా ఆవిడ తన తప్పుని గ్రహించి, కోడల్ని పంపడం మానుతారేమోనని అలా చేస్తున్నాను. ఆవిడలో మార్పు వచ్చే వరకు ఇలాగే చేద్దామనుకుంటున్నాను. అన్ని విషయాల్లో అత్త కోడళ్ళ మధ్య సత్సంబంధాలున్నప్పుడే ఎవరి జీవితాలైనా సవ్యంగా సాగుతాయని ఎప్పటికైనా ఆవిడ గ్రహిస్తే చాలు.

వాళ్ళ సంభాషణ విన్న కమలకి తను చేసిన తప్పు తెలిసొచ్చింది. కూతుర్ని అత్త వారింట్లో దింపి, మర్నాడే బయల్దేరి వచ్చేసింది. ఆ తర్వాత మరెప్పుడూ కూతురు పుట్టింటికి వచ్చినా రజనీని వాళ్ళ అమ్మ గారింటికి పంపలేదు. పైగా ఇప్పుడు కూతుర్ని, కోడల్ని కూడా సమానంగానే చూస్తున్నది. అత్తగారిలో ఈ మార్పు ఎలా వచ్చిందో, ఎందుకొచ్చిందో అర్థం కాలేదు రజనీకి. ఏదిఏమైనా తను కోరుకున్న మార్పు అత్తగారిలో అంత త్వరగా వచ్చినందుకు రజనీకి ఎంతో సంతోషం కలిగింది.